కథా నిలయం
48.99
శ్రీకాకుళం

# మనసూ-మమత

ధవళేశ్వరంలో తీర్థం జరుగుతోంది. ఆరోజు మధ్యాహ్నందాటి ఎండ వాలకముందు మూడింటినుండి ప్రారంభమై రాత్రి పదిపైబడేవరకు అక్కడ తీర్థం జరుగుతుంది. అటూ యిటూవున్న పల్లెల్నుండి, దగ్గర్లోని రాజమండ్రినుండి జనం తండోపతండాలుగా ఆ తీర్థానికి వస్తుంటారు. ఆ ఒక్కరోజూ అక్కడ కిళ్ళీ దుకాణాలకు, కాఫీ హోటళ్ళకు ఎక్కడలేని కళ! ఆ మర్నాటినుండి మళ్ళీ మామూలే! మిగతా రోజుల్లో కొవ్వొత్తి దీపాల్లాంటి ముఖాలతో అంతంతమాత్రంగా వ్యాపారం చేస్తుంటాయి.

రథం లాగడానికి యింకా అరగంట టయిముంది. అప్పటికి ఎండ పూర్తిగా వాలి కొద్దిగా ఎర్రనికిరణాలుమాత్రం గుడిగోపుర శిఖరంమీద పడుతున్నాయి.

జనం గుడిచుట్టూ గుమిగూడారు. ఇంకా వచ్చేవాళ్ళు వస్తూనేవున్నారు. అరగంటలో వీధులన్నీ కిటకిటలాడిపోయాయి. జనం రద్దీ ఎక్కువయ్యింది. ఒకర్నొకరు రాసుకుంటూ తోసుకుంటూ గర్భిణీస్త్రీలా మందంగా కదులుతున్నారు. ఒకరిమాట ఒకరికి వినిపించడంలేదు. ఎవరికివారే గట్టిగా అరుస్తూ మాట్లాడుకుంటున్నారు. పొలికేకలుపెట్టి పిలుచుకుంటున్నారు. నవ్వులబాగోతాలవెనక చీవాట్ల సింగారాలు వినిపించీ వినిపించనట్టు ఒకదానిలో ఒకటి కలిసిపోతున్నాయి. అంతలోకే ఒకవైపు గుంపులోంచి పదిమందిని తప్పించుకుని తెల్లని సన్నసినవ్వు ఖాళీగా వెళ్తోన్న కొంతమంది

ఉయ్యూరు లైబ్రరీ 19.3.94



కుర్రకారు కాళ్ళకు సడన్‌బ్రేకు వేసింది. వాళ్ళటుచూస్తే ఆ కుర్రది లేదక్కడ. పళ్ళూడిపోయిన ముసలమ్మ బోసినోరు బార్లా తెరిచివుంది!

జనంలో ఒక్కసారిగా కోలాహలం బయలుదేరింది. అంతా 'హరహరా' అన్నారు. రథం. కదిలింది. గుమిగూడిన జనం ఒక్కసారి వెనక్కు విరుచుకుపడి దూరంగా సాగుతున్నారు. గట్టుకు గండిపెట్టి వూళ్ళోకి జొరబడ్డ గోదావరి వరదనీటిలా జనం అవధుల్ని దాటుకుని ఊరివీధుల్లోకి, యిళ్ళ అరుగులమీదకి వ్యాపిస్తున్నారు.

పదిమంది జట్టుగా పెనవేసుకున్న చేతుల చైనుల్ని ఎక్కడికక్కడే తెంపుకుని తలా ఒకవైపు వెళ్ళిపోయారు. అరగజం దూరంలో ఒక మిఠారితో అవకాశం చిక్కి రహస్యంగా ఒక నల్లకళ్ళద్దాల పెద్దమనిషి మాట్లాడుతుంటే జనం విరుచుకుపడి పాతిక గజాల దూరం లాక్కుపోయి విడిచిపెట్టారు. ఒకాయన భావాల పలకల గ్లాసులో అందాన్ని నింపుకుని మంచినీళ్ళలా గడగడా కళ్ళతో తాగేస్తూ లోకాన్ని మరిచిపోతే ఎక్కడినుండో అరటిపండొకటి వచ్చి లెంపమీదవాలి యీలోకంలో విడిచిపెట్టిపోయింది.

రథం కదిలి పావుగంటయినా పట్టుమని పదడుగులుకూడా వెళ్ళలేదు.

రాజ్యం కంగారుగా ఆరేళ్ళకొడుకు రామూను వెంటబెట్టుకుని వచ్చింది-రథం గుడివీధి మలుపు తిరిగి బజారు రోడ్డు ఎక్కిందేమోనని.

నుంచోడానికి ఎక్కడా స్థలం కనిపించక కాస్సేపు ఆగి ఆయాసం తీర్చుకుని, జనాన్ని తప్పించుకుంటూ మెల్లగా వెళ్ళి ఎదురింటి అరుగు ఎక్కి, ముందరి నలుగుర్నీ బతిమలాడి కాస్త చోటుచేసుకుని నుంచుంది.

రాము నూతిలోని కప్పలా నుంచున్నాడు. కేకలు కోలాహలం వినిపిస్తున్నాయిగాని ఏమిటి జరుగుతున్నదో వాడికి తెలియడంలేదు. చుట్టూ వున్న ఆడాళ్ళంతా "అదిగో! అదిగో" అంటున్నారుగాని వాడికేమీ కనబడడంలేదు ఆడాళ్ళ చీరలుతప్ప.

రామూకి కోపంవచ్చింది. తల్లి కొంగుపట్టుకుని ఒక్కకుదుపు కుదిపాడు.

"ఏరా?" అంది తల్లి చిరాగ్గా.

"నాకు కనిపిత్తంలేదు...ఊ...ఊ" అన్నాడు. ఎత్తుకోమన్నట్టు ముఖంపెట్టి రెండు చేతులూ పైకి చాచాడు.

"అందుకే మీ నాన్నతో వెళ్ళమన్నాను. వెళ్ళకుండా నన్నేడిపించడానికి

తగలడ్డావ్" విసుక్కుంది తల్లి. మరి నాలుగు కసిరి ఎత్తుకొంది.

కాస్సేపు ఎత్తుకునేసరికి ఆవిడకి నడుం పుండులా అయిపోయింది. దింపేద్దామంటే దిగడంలేదు. కోపంకొద్దీ కిందకుదింపి ఒక్కకుదుపు కుదిపి "ఫో వెధవా, ఎలా అయితే వచ్చావ్" అంది.

రాము ఏమనుకున్నాడో ఏమో, తుర్రుమని రథం వచ్చేవయిపు జనంలోకి పరుగెత్తాడు.

"అమ్మో అమ్మో" అంటూ గుండెలుబాదుకొంటూ అరుగుదిగి జనంలోకి పరుగెత్తి రెక్కపట్టుకొని చరచరా వెనక్కు తీసుకొచ్చింది. తెచ్చి, నాలుగు లెంపకాయలువేసి, వాడు ఏడుస్తుంటే చూడలేక బెల్లం జిలేబీ కొనిచ్చింది. అంతసేపూ గుక్కపెట్టి ఏడుస్తున్నవాడల్లా జిలేబీ అందుకుని చప్పరించి "హి..హ్హీ" అంటూ చూశాడు తల్లివయిపు.

రాజ్యానికి నవ్వొచ్చింది. "నా బాబే...నా చిట్టే" అంటూ గారాబంగా దగ్గరకు తీసుకుని బుగ్గమీద ముద్దులిపి "తప్పుకదూ. కోప్పడితే అలా పారిపోవచ్చా. జనం తొక్కేయ్యరూ" అంది. అలా అంటూ ఒక్కసారిగా అదిరిపోయింది.

'అమ్మో! ఇంకేమయినా వుందా. ఇంకొంచెం ఆలస్యం చేస్తే నా చిట్టితండ్రి-నా బంగారు తండ్రి-జనంలో కలిసిపోయి ఏమయిపోయేవాడో! జనం తొక్కిడికి వాళ్ళమధ్య నలిగిపోతేనో? తన ఆశలన్నీ వాడిమీదే పెట్టుకొందిగదా. ఒక్కగానొక్క కొడుకయితేనేం రాజులా వందమందితో సమానం'

కొడుకు తల్లిమెడచుట్టూ గట్టిగా కావలించుకుని అరుస్తున్నాడు-

"అమ్మా...అమ్మా-నాన్నేవ్"

"ఏమిట్రా-నాన్నా? ఏరీ?" అంది రాజ్యం ఆలోచనల్లోంచి బైటపడి.

"అదిగోనే...అదిగో!" చెయ్యి అటుచాచి చూపించాడు.

"అవునురా, పిలు" అంది తల్లి.

నాలుగైదు పిలుపులు పిలిచాడు. వినిపించలేనట్టుంది, ధర్మలింగం యిటు చూడనేలేదు. బిక్కముఖంవేసి దీనంగా తల్లి ముఖంలోకి చూస్తూ చటుక్కున ఒడిలోనుండి జారిపోయి జనాన్ని తప్పించుకుని తండ్రిని చేరాడు. తండ్రి చంక ఎక్కి వాళ్ళమ్మను పిలుస్తూ చప్పట్లు చరిచాడు.

ధర్మలింగం కొడుకును తీసుకునివచ్చి "వాణ్ణి అలా వదిలేసావేమిటి! జనం తొక్కేయ్యరూ?" అన్నాడు భార్యతో.

"బాబ్బాబు, మీకు పుణ్యముంటుంది. వాణ్ణి మీ వెంట తీసుకునివెళ్ళరూ. నాదగ్గర తిన్నగా వుండడంలేదు" అంది రాజ్యం.

ధర్మలింగం చిన్నగా నవ్వుకొని "ఏరా! అల్లరిచెయ్యొచ్చా. తప్పుకదూ" అంటూ కొడుకును మందలించి వెంటబెట్టుకుని వెళ్ళిపోయాడు.

రాజ్యం మనసుకాస్త స్థిమితపడింది. 'లేకపోతే-ఒకటేగోల. తిన్నగా ఉండడుకదా!' అనుకుంది. కాస్సేపు ఆ బాబుని గురించిన ఆలోచనల్లో తేలిపోయి రథంవచ్చిందనే విషయమే గుర్తించలేదు. ఆ తర్వాత తేరుకుని 'అయ్యో! నామతిమండ. దేవుడికి అరటిపళ్ళయినా కొనలేదు'-అనుకుని తనమతిమరపుతనానికి తనకు తనే చీవాట్లు పెట్టుకుని గబగబా అరడజను అరటిపళ్ళు కొనితెచ్చింది. వాటిని రథం శిఖరంమీదకు బలంకొద్దీ విసిరి రెండుచేతులూ జోడించి 'ప్రభూ! నా బాబుని ఎంతవాడిని చేస్తావో ఆ భారమంతా నీదే' అనుకొంది.

ఆ తర్వాత రథం కదిలి యింకాస్తదూరంవెళ్ళి మలుపు తిరిగాక అరుగుదిగి బాబుకోసం బొమ్మలూ, ఏవో తినుబండారాలూ కొనేందుకని బయలుదేరింది.

అప్పటికప్పుడే చీకటిపడింది. కొట్లలో తెల్లగా పెట్రొమాక్సుదీపాలు వెలిగిపోతున్నాయి. ఆకర్షణకని అలంకరించిన రంగురంగుల కరెంటుదీపాలు వెలుగుతున్నచోట జనం రెక్కలపురుగుల్లా వచ్చి చేరుతున్నారు. చుట్టుపట్ల పల్లెల్నుండి వచ్చినవాళ్ళు చేతుల్నిండా బరువుతో చిన్నరకం గూడ్సుబండిలా మందంగా నడవలేకనడుస్తూ యింటిముఖంపడుతున్నారు. ఒక బేరంకుదిరిన బాపతు నల్లకళ్ళ తెల్లమ్మాయి పెద్ద పెద్ద అంగల్తో హుషారుగా కొంపవైపు కదిలింది. ఒకడు దవడ తడుముకుని రహస్యంగా చుట్టూచూసి తోకముడుచుకొని జనాన్ని దాటుకుని చరచరా వెళ్ళిపోయాడు.

రాజ్యం నాలుగుకొట్లూ తిరిగి కావలసినవి కొనుక్కొంది. బాబు ఆడుకోడానికని రబ్బరుబంతి, నొక్కితే కిచకిచలాడే రబ్బరుపిట్ట, అదేదోరకం రెండు రంగుల ప్లాస్టిక్‌బూర, చిల్లర చిల్లర అర్థణా, కాణీ సామానులు ఓ అరడజను కొంది.

అప్పటికే తెచ్చిన డబ్బంతా ఖర్చయిపోయి నాలుగణాలు మిగిలాయి. ఇంటికి వెళ్ళిపోదామని బయలుదేరి నాలుగడుగులు వేసి ఠక్కున ఆగిపోయి 'అవునుకదూ,

బాబుకి తినడానికోమరి'అనుకొని వెనక్కువెళ్ళి నాలుగుపొట్లాలు-రెండు తీపివి, రెండు కారానివి కొంది.

కొసరిచ్చినది తను నోట్లో వేసుకుని రాత్రి బాగా పొద్దుపోయిందనుకుంటూ గబగబా యింటికి బయలుదేరింది.

ఆమె నడుస్తున్నదన్నమాటేగాని ఆమె ఆలోచనలు బాబుచుట్టూ సీలింగుఫేను రెక్కల్లా గింగుర్లు కొడుతున్నాయి.

"ఇవన్నీ తీసుకెళ్ళి బాబుకిస్తే ఎంత సంబరపడిపోతాడో! నోరువిడిచి అడగనన్నా అడగడుగదా. ఎలా బతుకుతాడో ఏమో. కొనిస్తే తినడం, లేకపోతే లేదు. చూస్తుంటే వట్టి అమాయకుడిలా తయారయ్యేట్టున్నాడు. అయినా యిప్పుడింకా చిన్నతనమేకదా. పెద్దయితే గడుసుదేరడాఏం. మరికొన్నేళ్ళుపోతే తమని అడుగుతీసి అడుగేయకుండా అన్నిపనులూ వాడే చేసుకుపోడూ. అప్పుడు తమపని-తినడం, ఓమూల కూర్చోవడం, అంతే. ఇక ఆ పెళ్ళికూడా అయిపోయిందంటే - యింకేమిటి! కాలుమీద కాలువేసుకొని కూర్చోవడమేకదా. ఏమో....వచ్చే కోడలు ఎలా వుంటుందో..?'

కాళ్ళు ఆమెకు తెలీకుండానే మెయిన్‌రోడ్డుదాటి కూరలబజారు సందునబడి పదిగజాలదూరం నడిచి పక్కకుతిరిగి అకస్మాత్తుగా ఆగిపోయాయి. ఆ సందులోంచి మరో రెండు ఫర్లాంగులదూరం నడిచివెళ్తే యింటిని చేరుకొనేదేగాని ఎదురుగా అయిదేళ్ళపిల్ల వెక్కివెక్కి ఏడుస్తుంటే ఆమె ఆలోచనలు కరిగి కాళ్ళు ఆగిపోయాయి.

పిల్ల ఎర్రగా దొండపండులా వుంది. నుంచొని వుంటే పూలగౌను తొడిగి నిలబెట్టిన రబ్బరు బొమ్మలా అనిపించింది. బుగ్గలు ఉబ్బెత్తుగా, మనిషి బొద్దుగా- చూస్తే ముద్దేసుకొస్తోంది. మెళ్ళో వస్తువులేమీలేవుగాని చెవులకు బంగారపు రింగులు, చేతులకు బంగారపు గాజులుమాత్రం వున్నాయి. చూస్తుంటే కాస్త డబ్బున్నవాళ్ళ పిల్లలాగే వుంది.

రాజ్యం దగ్గరగా వెళ్ళి "ఏంపాపా! ఎందుకేడుస్తున్నావ్?" అంది. ఆ పిల్ల జవాబివ్వలేదు. మరికాస్త స్వరం హెచ్చించింది "అమ్మా....అమ్మా" అని ఒకటే రాగంతీస్తోంది ఆపిల్ల.

రాజ్యానికి అర్థమయ్యింది. మెల్లగా బుజ్జగించి చూసింది. మిఠాయిపొట్లం చేతిలో పెట్టింది.

ఆపిల్ల మిఠాయి తింటోంటే మెల్లగా లాలించి ఒకొక్క విషయం అడిగిందికాని

అన్నిటికీ ఆపిల్ల ఒకటే సమాధానం 'అమ్మ' అని.

ఊరికే ప్రశ్నలు వేసి ఆ పిల్లను విసుగెత్తించడం లాభం లేదనుకొని మరో మిఠాయిపొట్లం చేతికిచ్చి అటూయిటూ కొంత ధూరంవరకు తిప్పింది-ఎవరన్నా వెతుక్కుంటూ వచ్చేవారు కనిపిస్తారేమోనని. అరగంట వెతికినా ఎవరూ కనిపించలేదు. ఏంచెయ్యడానికీ ఆమెకు తోచక మళ్ళీ యధాస్థానానికి పిల్లను తీసుకొచ్చి దింపింది.

ఈ గొడవంతా తనకెందుకు, పిల్లను వదిలివెళ్ళిపోదాం-అనుకుంది కాని ఒక్క అడుగూ ముందుకు వెయ్యలేకపోయింది.

'పాపం! పిల్ల ఒంటరిది. వంటిమీద వస్తువులుకూడా వున్నాయి. ఏ వెధవ కంటనన్నాపడితే యింకేముంది! కూడా తీసుకుపోయి ఏ గొంతోనొక్కేసి వస్తువులతో వుడాయించేయడూ. పిల్ల బంగారపుబొమ్మ, ఎలావదిలేయడం?' అంటూ ఆలోచించింది. అంతలోకే మళ్ళీ-

'మరి వదలకుండా తనుమాత్రం ఏం చెయ్యగలదు. యింతమందిలో ఆపిల్ల తల్లిదండ్రుల్ని ఎక్కడని వెతకడం?' అనుకుంది.

ఏమీతోచక చాలాసేపు అలానే నిలుచుండిపోయింది. ఉన్నట్టుండి ఒక్కసారిగా మేఘాలమధ్య మెరుపులా ఆమె ముఖంలో ఒక్కవెలుగు వెలిగింది. చిరునవ్వు చటుక్కున పెదాలమీద జిగేల్‌మంది. అదీ ఒకే ఒక్క క్షణంమట్టుకే. ఆ తర్వాత ఉరుముశబ్దానికి మేఘాలు కంపించినట్టుగా గజగజలాడిపోయింది. 'ఆ పిల్లను తను యింటికి తీసుకుపోయి పెంచుకుంటే' అన్న ఆలోచనకు పుట్టెడు భయం, క్షయరోగంత ఆయాసం, పదిరోజులు ప్రాయోపవాసం చేసినంత నీరసం వ్యాపించాయి.

'అమ్మో!...యింకేమయినావుందా. తెలిస్తే పోలీసులు లాక్కుపోరూ... మర్నాటినుండి మళ్ళీ తను తలెత్తుకుని నలుగుర్లోనూ తిరగ్గలదా' అనుకుంది.

కాని పాదరసంలా ఆ ఆలోచన హృదయంలోకి యింకిపోకుండానే ఎటో జారిపోయింది. ఆ పిల్ల రాజ్యం చెంగుపట్టుకుని ఎత్తుకోమన్నట్టుగా ఆమె ముఖంలోకి చూస్తోంది. తల్లిదండ్రుల్ని మర్చిపోయినట్టుందిగాబోలు, ముఖంలో ఆ విచారం తాలూకు చిహ్నాలేమీలేవు. మరింత అందంగా వెలిగిపోతోంది ముఖం.

'ఇప్పుడు తీసుకుపోతేమాత్రం ఎవరు చూడొచ్చారు? కాకపోతే కొంతకాలం రహస్యంగా వుంచుకుంటేసరి. అయినా పిల్ల యీ వూళ్ళోదిమాత్రంకాదు. ఏ పొరుగూరిదో అయ్యుండాలి. అంతకీ యింటి చుట్టుపట్లవాళ్ళు అడిగితే అదేదో సీమలో వుంటున్న

మా అన్న కూతురు, రాజమండ్రికి పనుండి వాళ్ళు వచ్చినప్పుడు బలవంతంచేసి అమ్మాయిని తీసుకొచ్చానంటే నమ్మకేంజేస్తారు.కలవారిపిల్ల. చుక్కలా వెలిగిపోతోంది. ఇంతచక్కటి అవకాశాన్ని వదులుకోవడమేమిటి. అంతకీ పిల్లవాళ్ళెవరన్నా వెతుక్కుంటూ వస్తే చూసిచూసి యిప్పుడే యింటికి తీసుకొచ్చానని చెప్పి యిచ్చెయ్యొచ్చు.'

రాజ్యం ఒకమారు భయంభయంగా చుట్టూ చూసింది. మెయిన్‌రోడ్డుకు కుడివైపుకు అవతలగా దానికి సమాంతరంగా వున్న చిన్న సందుకావడంవల్ల ఆ సందులో జనం అట్టేలేరు. వున్న కొద్దిమందీ ఎవరిపనుల్లో వాళ్ళున్నారు. ఆ సందులో ఎలక్ట్రిక్ దీపాలుకూడా వెలగడంలేదు.

'రా అమ్మా పాపా' అంటూ రాజ్యం ఆ పాపని ఎత్తుకుని బాబుకని కొన్న బొమ్మలన్నీ పాపచేతిలో పెట్టింది. పైమీది పవిటను సగంవరకు పాపను మూసేలా కప్పి, ఎవరూ చూడ్డంలేదని నిర్ధారణ చేసుకుని మెల్లగా చీకటి నీడల్లోంచి బయలుదేరింది.

ఆ సమయంలో ఆమె గుండె పాషాణంలా అయిపోయింది. దయాదాక్షిణ్యాల్నీ పాపపుణ్యాల్నీ మర్చిపోయింది. స్వార్థం నిలువెల్లా నిండిపోయింది.

రాజ్యం ఆ ఎదురుగా వస్తోన్న ఎవరినో చూసి గతుక్కుమంది. శరీరం ముచ్చెమటలుపోసాయి. ఆ వస్తోన్న మనిషి తనను దాటుకునిపోయేకగాని ప్రాణం కుదుటపడలేదు.

ఫర్లాంగు దూరం అప్పుడే దాటిపోయింది. మరో ఫర్లాంగు దూరం నడిస్తే యిల్లు. అడుగులు వేగం హెచ్చించింది. గబగబా నడక సాగించింది.

వెనకనించి ఎవరో చప్పట్లు కొడుతున్నారు.

"ఏయ్ అమ్మీ ఆగు" ఎవరిదో కంఠం వినిపించింది.

ఆమె పైప్రాణాలు పైనే పోయాయి. నడుస్తున్నదల్లా చటుక్కున ఆగిపోయింది. వెనక్కి తిరిగిచూసే ధైర్యంలేదు. పరిగెత్తుదామంటే కాళ్ళు రావడంలేదు. సమయంకూడా మించిపోయింది. ఎటువెళ్ళినా వెంబడించి పట్టుకుంటారు. ఈ పాటికి అరిచిన మనిషి దగ్గరగా వచ్చేసివుంటాడు-భయంతో ఎండుటాకులా అల్లల్లాడిపోతూ చీకట్లో బిక్కచచ్చిపోయినట్లు నిల్చుండిపోయింది.

ఎవరో పురుషుడు ఒగర్చుకుంటూవచ్చి ఆమెముందు వెళ్తున్న ముసలమ్మను

ఆపి "డబ్బులివ్వకుండా పారిపోతున్నావేం ముసల్దానా. బేరంలో వుండిపోయానని మా బాగా లోకరా యిచ్చి జారిపోతున్నావ్. ముందు ముప్పావలా యిలా యివ్వు, లేకపోతే పోలీసులకు వప్పజెప్పుతా" అంటూ గద్దించాడు.

రాజ్యం 'హమ్మయ్య' అంటూ తేలిగ్గా ఊపిరితీసి విడిచింది. ఎక్కడనో మర్చిపోయిన దేవుడు గబుక్కున జ్ఞాపకానికి వచ్చి 'గండం తప్పించావు తండ్రీ. ఇంటికి వెళ్ళాక రేపు నైవేద్యం పెడతా. సోమాలమ్మకు కోడిపిల్లను కోసిస్తా' అనుకుంది. ఇక అట్టే ఆలస్యం చేయకుండానే, పూర్తిగా ఆయాసం గుండెదడ కాళ్ళవణుకు తీరకుండానే రాజ్యం అక్కడనుండి కదిలిపోయింది.

ఇంటికి వెళ్ళి తలుపుతాళంతీసి ఒక్కవూపులో యింట్లోకి వచ్చిపడింది. తలుపులు దగ్గరగా చేరేసుకుని లోపల గెడపెట్టుకుని పాపనుదించి అక్కడే కూర్చుండిపోయింది. అలా కూర్చున్నది అరగంటవరకు కదలనేలేదు.

పాపకు ఆ యిల్లు కొత్తగా వున్నట్టుంది, గది నాలుగు గోడల్నీ చిత్రంగా చూస్తూ కూర్చుంది.

రాజ్యంలేచి కిటికీ తెరిచి వీధిలోకి చూసింది. ఆ తర్వాత ఏమనుకున్నదోగాని పాపకు కాస్త అన్నంతినిపించింది. ఆ పాపను స్నానాలగదిలో దిగవిడిచి ఆడుకోడానికి బొమ్మలు ముందుపడేసింది. ఆ గదితలుపులు గెడపెట్టి నడవాలోకొచ్చి కిటికీముందు కూర్చుంది. ఆమె ఆలోచనలు యింకా పాపచుట్టూనే తిరుగుతున్నాయి. చాలాసేపు అలానే కూర్చుండిపోయింది.

ఆకలివేయకపోతే రాజ్యం యింకా ఎంతసేపు కూర్చునేదో. భోజనం చేద్దామని లేచి అన్నం వడ్డించుకుని తింటూతింటూ 'ఇంకావారు రాలేదేమిటి చెప్మా' అనుకుంది. ఆ ఆలోచనరాగానే ఆమె మనసు ఎలాగో అయిపోయింది.

'అప్పుడే తొమ్మిది దాటుతోంది. ఇంకా వారు రాలేదేమిటి? బాబుని తీసుకెళ్ళారు. వాడు తిన్నగా వున్నాడో లేడో. వెధవ, సరిగ్గా వుండడుకదా. వారు యింత ఆలస్యం ఎప్పుడూ చెయ్యనేలేదే. ప్రతిపండక్కీ అలా తిరిగి ఆరింటికే యింటిని చేరుకునేవారు. ఒకవేళ బాబు...అంతమంది జనంలో ఎక్కడన్నా తప్పిపోయాడో ఏమో! జనం-మాటలా! నేల యీనినట్టున్నారు. తోపుళ్ళు, గుద్దులాటలు-ఒకటేమిటి నానాఅల్లరి. వాళ్ళమధ్య దూరితే నా చిట్టితండ్రి....అమ్మో'

ఆ ఆలోచన రాగానే ఆమెకు అన్నం మరి సహించలేదు. గిన్నెలో నీళ్ళు వంపి

లేచిపోయింది. గబగబా వీధి తలుపు గెడతీసుకుని అరుగుమీదకు వచ్చి చూస్తూ నుంచుంది.

వీధిలో దీపాలులేవు. ఒక కిళ్ళీకొట్టుమీద పెట్రోమాక్సులైటు వెలుగుతోంది. ఆ లైటుముందు జనం అడ్డుగా నిలబడడంతో వీధిలో చీకటి నీడలు పరుచుకున్నాయి. ఆ వీధి చివరినుండి కిళ్ళీకొట్టుమీదుగా ఎవరూ వస్తున్న అలికిడిలేదు.

ఆమెకు ఆరాటం మరీ ఎక్కువయ్యింది. స్నానాల గదిలో గొళ్ళెంపెట్టి దాచిన పాప ఏకాంతాన్నీ, చీకటినీ చూసిగాబోలు ఒకటే గుక్కపెట్టి ఏడుస్తోంది.

రాజ్యానికి ఆ ఏడుపేం వినపడ్డంలేదు. అసలు పాప విషయం పూర్తిగా మర్చిపోయింది. మాటిమాటికీ వీధిలోకివచ్చి ఎవరన్నా వస్తున్నారేమోనని కాస్సేపు చూడడం, ఎవరూ రాకపోయేసరికి మళ్ళీ లోపలికి వెళ్ళడం-దీనితోనే ఆమెకు పూర్తిగా పిచ్చెక్కిపోయినట్టు అయిపోయింది.

ఇక ఆట్టేసేపు ఆ యింటర్లో వుండలేక తలుపుగొళ్ళెం పెట్టి గబగబా బయలుదేరి తీర్థం జరిగినచోటుకు వచ్చింది.

తీర్థం జనం చాలావరకు పల్చబడ్డారు. వీధులన్నీ ఖాళీ అయ్యాయి. రంగులరాట్నం, సాయిబు సర్కస్, జముకులకథదగ్గరమాత్రం కొద్దికొద్దిగా జనంవున్నారు.

రాజ్యం ఆ స్థలాలన్నీ వెతికింది. 'బాబూ రామూ' అంటూ పిలుస్తూ గుడి-బజారుమధ్య వీధులన్నీ తిరిగింది. ఎక్కడా ధర్మలింగంగాని, బాబుకాని కనిపించలేదు. తన పిరికితనాన్ని ఎలా సమాధానపర్చుకోవడమో తెలీక కళ్ళనీళ్ళు కార్చుకుంది.

'ఏమో...ఎక్కడికన్నా వెళితే యీపాటికి యింటికి వచ్చేస్తారేమో' అనుకుని పరిగెత్తినట్టు నడిచి యింటిని చేరుకుంది. ఇంటిదగ్గర తను పెట్టిన గొళ్ళెం పెట్టినట్టే వుంది.

ఆమెకేమీ పాలుపోలేదు. గొళ్ళెం అయినా తియ్యకుండానే అక్కడే అరుగుమీదే చతికిలబడి వీధిలోకి చూస్తూ కూర్చుంది.

ఆమె మనసు మనసులోలేదు. ఎరిగిన దేవుళ్ళందర్నీ పేరుపేరునా తలచుకుని వాగ్దానాలు చేస్తోంది.

కిళ్ళీకొట్టుదగ్గర సిగరెట్టు కొనుక్కుని వస్తున్నాడు ధర్మలింగం. రాజ్యం చూసింది.

చూడగానే ఆమె గుండె గతుక్కుమంది.

ధర్మలింగం పక్కన బాబులేడు. ఆమెగుండె గబగబా కొట్టుకుని ఆగిపోయేంతపనైంది. ఎవరైనా నవ్వుతారనైనా చూడకుండా వీధిలోకి పరుగెత్తి ధర్మలింగానికి ఎదురువెళ్ళింది.

పాపం! మధ్యలో కుచ్చిళ్ళు కాళ్ళల్లోపడి పడిపోబోయిందిగాని లేచినవేళ బావుండి అంతపనీ జరగలేదు.

పరుగెత్తుకొస్తోన్న భార్యను చూసేటప్పటికి ధర్మలింగానికి మతిపోయింది. ఎక్కడున్నవాడు అక్కడనే నిలబడిపోయి విచిత్రంగాచూస్తూ, ఆమె దగ్గరకు రాగానే "ఏమిటి రాజ్యం...ఏమయ్యింది?" అన్నాడు.

ఆ ప్రశ్న అతను పూర్తిచేసాడోలేదో, ఒగర్చుకుంటూ "బాబేడండీ?" అంది రాజ్యం.

ఆమె ఎందుకడుగుతుందో అర్థంకాక తెల్లబోయి "ఎందుకు?" అని, భార్య ఆతృతచూసి తిరిగి అతనే "వాళ్ళ చిన్నాన్నతో సినిమాకి వెళ్ళాడే. వచ్చేస్తాడు. మరో అరగంటలో ఆటయిపోతుంది" అన్నాడు.

'హమ్మయ్య' అనుకొని తేలిగ్గా ఊపిరితీసి విడిచింది రాజ్యం.

వాళ్ళాయనమీద పుట్టెడుకోపం వచ్చింది రాజ్యానికి. "పంపిస్తే కాస్తా యింటికి ముందొచ్చి విషయం చెప్పకూడదూ" అంది ఉక్రోషంపట్టలేక. ఆ తర్వాత తన భయాన్ని తలచుకుని నవ్వుకుంది. ఇప్పుడామె గుండె ఉల్లిపొర కాయితంతో చేసిన నాలుగు అరల పెట్టెలా అయిపోయింది.

భర్త ఏదో అడుగుతుంటే "తర్వాత చెప్తాలెండి. ముందు యింటికి రండి" అంది.

ఇంటికొచ్చాక సరాసరి స్నానాల గది దగ్గరికెళ్ళి గొళ్ళెం తీసింది.

పాపం! పాప ఏడ్చిఏడ్చి అలసిపోయినట్టుంది, ఆ నేలమీదే పడుకుని నిద్రపోతోంది. పాప చేతికిచ్చిన బొమ్మలన్నీ పాపలాగే చిందరవందరగా నేలమీద పడున్నాయి! వాటన్నిట్నీ ఏరి పాపను నిద్రలేపి, భర్తను వెంటబెట్టుకుని పాపతో తీర్థం స్థలం దగ్గరకొచ్చింది. దారిలో, జరిగిన విషయమంతా అతనికి చెప్పింది.

ధర్మలింగం నవ్వుకున్నాడు.

మెయిన్‌రోడ్డు సెంటర్లో ఓ ఎలక్ట్రిక్ స్తంభంకింద పాపని ఎత్తుకుని నుంచున్నారు.

ఓ గంటగడిచింది. తీర్థం జనం అంతా వెళ్ళిపోయారు. వీధులన్నీ నిర్మానుష్యమైపోయాయి. కొట్లల్లోమాత్రం యింకా అక్కడక్కడ దీపాలు వెలుగుతూనే వున్నాయి. ఆ కొట్లల్లోని వ్యాపారస్తులు తమతమ బేరాల్ని తిరగేసుకుని లాభాల్ని లెక్కించుకుంటున్నారు. అలా లెక్కపెట్టుకొంటూ మధ్యమధ్య వాళ్ళవైపు అదోలా చూస్తున్నారు.

రాజ్యం ఎత్తుకున్న పాప అకస్మాత్తుగా "అమ్మ...అమ్మ" అంది. అలా అంటూనే ఒక్క ఉదుటున కిందకి దిగిపోయి పరుగెత్తింది. ఎదురుగా కొంతమంది వస్తోంటే వాళ్ళదగ్గరకు వెళ్ళి ఒకామె మోకాళ్ళచుట్టూ తీగలా పెనవేసుకుపోయింది. ఆమె ఆ పిల్లను ఎత్తుకుని గుండెలకు అదుముకుని, ముద్దులు కురిపించి, తలనిమిరి, విశాల వృక్షంలా ఆ పిల్లను ఆవరించుకుని రాజ్యంవాళ్ళూ వున్నదగ్గరకు వచ్చింది.

రాజ్యం ఏదో చెప్పబోయిందికాని ఆమె దగ్గరకు వచ్చీరావడంతోనే "చాలా కృతజ్ఞతలమ్మా. మీమేలు మర్చిపోలేం, మాపిల్లమాకు దొరికింది" అంది. ఆమె కళ్ళు కృతజ్ఞతతో మెరుస్తున్నాయి. ఆమె ముఖం సంతోషంతో నిండిపోయివుంది.

రాజ్యం హృదయం ఆకాశంలోకి ఎగరవేసినట్టయ్యింది.

ఆనందం గజ్జెలుకట్టి ఆడినట్టనిపించింది. తృప్తి ఆమె గుండెల్లోంచి పొంగిపొర్లింది.

రాజ్యం వాళ్ళకు ప్రతినమస్కారంచేసి మెల్లగా అక్కడ్నుంచి భర్తతో యింటికి బయలుదేరింది.